క్లుప్తంగా

ఇంటింటా పింఛన్ల పంపిణీ



పెళ్లకూరు మిట్టలో దివాంగునికి పింఛన్ నగదు అందిస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఆదివారం సెలవుదినం అయినప్పటికీ పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేశారు. మండలంలోని 24 పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నడవలేని దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణరావు, వివిధ పంచాయతీల కార్యదర్శులు, సోషల్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వెదురుపట్టు గ్రామానికి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

దొరవారిసత్రం : తనియాలి, మావిళ్లపాడు, వెదురుపట్టు గ్రామానికి వెళ్లే మార్గంలో పీఆర్ శాఖకు చెందిన తారు రోడ్లు గత ఏడాది మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వచ్చిన వరదలకు కోతకు గురయ్యాయి. రాత్రిళ్లు ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ముగిసిన బైబిల్ శిక్షణా తరగతులు



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చర్చి పెద్ద లలితమ్మ

చిల్లకూరు : క్రైస్తవుల పిల్లలకు వేసవి కాలంలో నిర్వహించే వేసవి బైబిల్ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో 15 రోజులుగా చిన్నారులకు బైబిల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలు చిత్ర లేఖనం పోటీలు, బైబిల్ క్విజ్, లాంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న చిన్నారులందరికీ సర్టిఫికెట్లు ఇచ్చారు. చర్చి పెద్ద గిద్దలూరు లలితమ్మ మాట్లాడుతూ చిన్నతనంలోనే ఏసు క్రీస్తు గురించి తెలుసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలని, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసేలా బైబిల్‌లోని అంశాలను వారికి బోధించినట్టు చెప్పారు. కార్యక్రమంలో బైబిల్ ఉపాధ్యాయులు, సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్, చర్చి ఎల్‌సీసీ, పీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

పేద బలిజ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం నేతలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఓ ప్రవేటు పాఠశాలలో ఆదివారం పేద బలిజ విద్యార్థులకు బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. ఆ సంఘం నాయకుడు సారంగం శ్రీనివాసరావు మాట్లాడుతూ బలిజల్లోని పేదలు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ఆర్థికంగా అండగా నిలిచేందుకు బలిజ విద్యా దీవెన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బలిజ పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చి సహకారం అందిస్తున్నారని తెలిపారు.

రూ.32 లక్షలతో కల్వర్టు నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కల్వర్టు

ఓజిలి : మండలంలోని వెంకటరెడ్డిపాళెం సమీపంలో రూ.32 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు ధ్వంసమై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కల్వర్టు పైపులు కొట్టుకుపోయాయి. ఈ క్రమంలో రూ.32 లక్షలతో కల్వర్టు పనులు చేపట్టారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు. కల్వర్టు పనులు పూర్తయితే వెంకటరెడ్డిపాళెం నుంచి కొండవల్లిపాడు, మానమాల గ్రామాల వాసులకు సౌకర్యంగా ఉంటుంది.

ఆనేపూడి మేత పోరంబోకు భూమిలో జామాయిల్ సాగు, ఆక్రమిత భూమితో యంత్రాలతో తవ్విన బావులు







ఆక్రమణలో అటవీశాఖ భూమి

- యథేచ్ఛగా గుంతలు తవ్విన వైనం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు
- ఆ భూమి విలువ రూ.2 కోట్లు

దొరవారిసత్రం : ఆనేపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 10, 11, 12లోని సుమారు 25 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమిని స్థానికులు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా బావులు తవ్వుతున్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.2 కోట్లకు పైగామాటే. భూమి ఆక్రమణ విషయం తెలిసినా అటవీశాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆనేపూడి– కల్లూరు రెవెన్యూ సరిహద్దు ప్రాంతంలో రిజర్వు ఫారెస్టు భూమి సుమారు 20 ఎకరాలు పైగా ఆనేపూడి గ్రామానికి చెందిన పలువురు భూస్వాములు ఆక్రమించుకున్నారు. అందులో యంత్రాలు పెట్టి చెట్టుపుట్టా తొలగించి సాగుకు అనువుగా సిద్ధం చేసుకున్నారు. ఈ భూములు ఎకరా రూ.5 లక్షలపైగా ధర పలుకుతోంది. ఆక్రమిత భూముల్లో జామాయిల్ చెట్లు, వివిధ రకాల తోటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు



ఆనేపూడి-కల్లూరు సరిహద్దు ప్రాంతంలో సాగుకు అనువుగా ఆక్రమణదారులు చదును చేసిన ఫారెస్టు భూమి



మేత పోరంబోకు భూమిని చదును చేస్తున్న యంత్రాన్ని అడ్డుకుంటున్న అప్పటి తహసీల్దార్ జయప్రకాష్(ఫైల్)

స్పందించి ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఆనేపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 10, 11, 12లో ఉన్న పశువుల మేత పోరంబోకు భూములను కొందరు చదును చేస్తుండగా అప్పటి తహసీల్దార్ జయప్రకాష్ అడ్డుకున్నారు. ఒక యంత్రాన్ని, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కొన్నేళ్లు గుట్టుగా ఉన్న ఆక్రమణదారులు మళ్లీ యధావిధగా మేత పోరంబోకు భూముల కబ్జాకు తెరతీశారు. సుమారు 20 ఎకరాలకు పైగా భూమిని ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు అందులో బావులు తవ్వేందుకు సిద్ధమయ్యారు.

అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం

ఆనేపూడి రెవెన్యూ పరిధిలోని పశువుల మేత పోరంబోకు భూమి, ఆనేపూడి-కల్లూరు సరిహద్దు ప్రాంతంలోని ఫారెస్టు భూముల ఆక్రమణ విషయం తమ దృష్టికి రావడంతో అడ్డుకున్నాం. ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశాం. ఫారెస్టు భూమి ఆక్రమణ విషయాన్ని సంబంధిత అధికారులు సమాచారం ఇచ్చాం. – యుగంధర్, వీఆర్వో, కొత్తపల్లి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని పూజలు



విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం మెట్లకు పూజలు చేస్తున్న దశరథరామిరెడ్డి

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు తీసుకోవాలని కోరుతూ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం మెట్లకు పూజ చేసుకుంటూ మోకాళ్లపై ఎక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సూళ్లూరుపేట శాసన సభ్యులుగా కిలివేటి సంజీవయ్య విజయం సాధించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

నేదురుమల్లిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



నేతలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి నేతలతో ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలపై చర్చించారు. రేపు జరగబోవు ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్లు నియామకం గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, ఏనుగు సుధాకర్ నాయుడు, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, దువ్వూరు శేషారెడ్డి, సంపత్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మేకపాటి విక్రమ్‌రెడ్డి



పెంచలకోన, అంకమ్మ తల్లి ఆలయం వద్ద మేకపాటి విక్రమ్‌రెడ్డి, అభినవరెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని ఆత్మకూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనయుడు మేకపాటి అభినవరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు మండలంలోని పోతుకొండ అంకమ్మను దర్శింకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయనరెడ్డి, లీలామోహన్‌రెడ్డి, నారసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని తూర్పువీధిలోని ఉన్న గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈనెల 7వ తేదీ వరకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



రాపూరు గ్రంథాలయంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దశ్యం

రాపూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులకు వస్తున్న విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల వలన విద్యార్థుల్లో పఠనాశక్తి, సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. విద్యార్థు లు గ్రంథాలయాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

గ్రామ దేవతకు సామూహిక పొంగళ్లు



గ్రామ దేవత అంకమ్మ మాను వద్ద ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

దక్కిలి : మండలంలోని శ్రీపురంలో ఆదివారం గ్రామ దేవత అంకమ్మకు గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. గ్రామంలో పాడి పంటలు బాగా ఉండి, ప్రతి కుటుంబమూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుతూ గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యులు కలిసి వచ్చి గ్రామనడి బొడ్డులో ఉన్న అంకమ్మ మాను వద్ద పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేశారు. వర్షాలు బాగా పడి గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.



అంకమ్మకు సామూహిక పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టారు. ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

భూసార పరీక్షలకు వేళాయే

రైతు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తాడు. తగిన దిగుబడి రాకుంటే నష్టాలపాలవుతాడు. ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి. ఏ నేల ఏ పంటకు అనుకూలంగా ఉంటుంది అన్న వివరాలు ముందే తెలిస్తే రైతు నష్టపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయిస్తోంది. తద్వారా రైతులకు పంటలసాగులో సాయం అందిస్తూ నష్టపోకుండా చూడడంతోపాటు అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటోంది. – చిల్లకూరు

- భూసార పరీక్షలతో రైతులకు ఎంతో లాభం
- తిరుపతి, నెల్లూరులో పరీక్షా కేంద్రాలు



మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ (ఫైల్)

ప్రస్తుతం నియోజకవర్గంలో వరి కోతలు పూర్తయ్యాయి. చెరువు ఆయకట్టు కింద పంటలు సాగు చేసే రైతులు మళ్లీ సాగుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో భూముల్లో భూసార పరీక్షలు చేయించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా మట్టి నమూనాలు సేకరిస్తోంది. వేసవి కావడం, నేల బాగా ఆరి ఉండడంతో ఇప్పుడు భూమిలోని మట్టిని సేకరించి పరీక్షలు చేస్తే ఎలాంటి సూక్ష్మ పోషకాలు ఉన్నాయనే విషయం తెలుస్తుందని అధికారులు తెలిపారు. తద్వారా రబీ సీజన్‌లో నేల స్వభావాన్ని బట్టి వరి రకం సాగు చేసుకునేందుకు వీలుండడంతో పాటు మంచి దిగబడి సాధించవచ్చని వెల్లడించారు.

ల్యాబ్‌లకు మట్టి నమూనాలు

తిరుపతి, నెల్లూరులో భూసార పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలను ఆయా కేంద్రాలకు పంపి పరీక్ష చేయిస్తున్నారు. ఫలితం వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తారు. ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలి, అందులో ఉన్న సూక్ష్మ పోషకాలు, స్థూల పోషకాల వివరాలను చెబుతారు. తద్వారా ఎలాంటి ఎరువులు వాడాలో అవగాహన కల్పిస్తారు.

మట్టి పరీక్షల వల్ల కలిగే లాభాలు

భూసార పరీక్షల వల్ల సూక్ష్మ పోషకాలైన ఐరన్, జింక్, మెగ్నీషియం ఎంత మోతాదులో ఉన్నాయనే విషయం తెలుస్తుంది. అలాగే స్థూల పోషకాలైన భాస్వరం, నత్రజని, పొటాష్, ఎంత మొతాదులో ఉంటాయనే విషయాలు తెలుస్తాయి. తద్వారా ఏయే ఎరువులు వాడాలో తెలుస్తుది.

6 నుంచి భూసార పరీక్షలు

మట్టి నమూనాలను ఈ నెల 6 నుంచి సేకరించి ల్యాబ్‌లకు పంపేలా అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే మట్టి నమూనాలను సేకరించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల తరుణం కావడంతో ఫలితాల అనంతరం మట్టి నమూనాలను సేకరించేందుకు సిద్ధం అవుతున్నారు.

ఫలితాల ఆధారంగా పంటల సాగు చేపడతాం



మట్టి పరీక్షలను ప్రయివేటు పరంగా కూడా చేయించుకోవచ్చు. సరిగా ఫలితాలు వస్తాయనే నమ్మకం లేకపోవడంతో ప్రభుత్వం ద్వారా వ్యవసాయ శాఖ చేపట్టే మట్టి నమూనాల పరీక్షల కోసం ఎదురు చూస్తుంటాం. పరీక్షల అనంతరం వచ్చే ఫలితాల ఆధారంగా అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేసుకుంటున్నాం.

– కట్టా రామిరెడ్డి, ముత్యాలపాడు

కట్టుదిట్టంగా మట్టి నమూనాల సేకరణ



ప్రతి రైతూ పొలంలోనూ మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతాం. ఫలితాల ఆధారంగా రైతులకు సూచనలు ఇస్తున్నాం. నమూనాలు సేకరించిన పొలంలో ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలనే విషయాలు చెప్పడంతో పాటు పచ్చరొట్టె విత్తనాలు ఎరువు, పశువుల ఎరువు ఎంత మోతాదులో వేయాలనే విషయాలను తెలియజేస్తాం.

– భవాని, ఏవో

● జలకాలాట



సిలికా గుంతల్లోని నీటిలో ఈత కొడుతున్న యువకులు

చిల్లకూరు : గత ఐదు రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు అల్లాడుతున్నారు. కొంచెం నీడ, నీరు ఉన్నచోటుకు పరుగులు తీస్తున్నారు. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు మార్గమధ్యంలో ఉన్న సిలికా గుంతల్లో నిలిచిన నీటిలో జలకాలాటలు ఆడారు. వారిని స్థానికులు హెచ్చరించారు. జాగ్రత్తలు పాటించాలని, లేదంటే ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.